www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 5 ఆగస్టు 2024 | 5 | కాకినాడ



నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. స్థానిక శారదా దేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి పదిన్నర గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ నెంబర్ 0884-2357800కు సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు.

పస్తుల్లో భవన నిర్మాణ కార్మికులు

- అందుబాటు ధరలో లేని ఉచిత ఇసుక
- పెరుగుతున్న మెటీరియల్ ధరల భారం
- నత్తనడకనే భవన నిర్మాణాలు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

భవన, ఇతర నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పట్ల కూటమి సర్కారు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సరసమైన ధరకే ఇసుకను అందుబాటులో ఉంచుతామని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు హామీ ఇచ్చినా ఆచరణలో ఉచిత ఇసుక అంటే సామాన్యులకు ఒరిగిందేమీ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితుల్లో నిర్మాణ రంగం ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అనే చందంగా మారిపోయింది. మరోవైపు సీజన్ కాకపోవడంతో ముహూర్తాలు కూడా లేవు. ఇంకో వైపు మెటీరియల్ ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇలా అనేక రకాల కారణాల రీత్యా నిర్మాణ రంగం నత్తనడకన సాగుతోంది. దీంతో వేల మంది కార్మికులు పస్తులతో గడుపుతున్నారు.

తగ్గని ఇసుక ధరలు

కాకినాడ, తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 5 లక్షలమంది కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్నారు. వీరిలో 2.46 లక్షల మంది కార్మికులు మాత్రమే సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నారు. కూటమి సర్కారు ఉచిత ఇసుక అంటూ ఆర్భాటంగా ప్రకటించి గత నెల 8న ప్రారంభించింది. ఉచిత ఇసుక ఎవరికి అర్థం కావడం లేదని గతం కంటే ధరలు బాగా పెరిగాయని కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గత వైసిపి పాలనలో మాదిరిగానే ప్రస్తుతం కూడా ఇసుక ధర పలుకుతోందని పలువురు చెబుతున్నారు. గతంలో రాజమండ్రి నుంచి జగ్గంపేట వరకూ 10 టన్నుల ఇసుకకు రూ.8,500, 20 టన్నులకు రూ.18500 ఖర్చు అయ్యేది. ప్రస్తుతం 10 టన్నులకు రూ.12 వేలు, 20 టన్నులకు రూ.28 వేలు అవుతోందని నిర్మాణదారులు చెబుతున్నారు. మరోవైపు బుకింగ్ చేసిన రెండు మూడు రోజులు గాని పూర్తిస్థాయిలో ఇసుక అందుబాటులో లేని నేపథ్యంలో నిర్మాణాలు ముందుకు సాగక పనులు లేకుండా పోయాయి. గత వైసిపి పాలనలో నూతన ఇసుక పాలసీ వల్ల నిర్మాణ కార్మికులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. ఉపాధి లేక ఆకలితో అలమటించారు. కుటుంబ పోషణ కోసం అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. నూతన కూటమి ప్రభుత్వంలో కూడా ఇదే పరిస్థితి ఉంటుందా అనే సందేహాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతూనే ఉన్న సామగ్రి ధరలు

నిర్మాణ సామగ్రి ధరలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. గతంలో రెండు సెంట్లలో ఇంటికి రూ.5 నుంచి రూ.6 లక్షలు సరిపోయేది. ఇప్పుడు రూ.14 నుండి 18 లక్షల వ్యయంతో గాని ఇల్లు పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. సిమెంటు, ఇసుక, ఇటుక, కంకర, ఐరన్, గ్రావెల్, కలప, ఎలక్ట్రికల్ సామాన్లు ఇలా అన్ని రేట్లు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం సీజన్ కాకపోవడంతో ఐరన్ ధర నిలకడగానే ఉంది. మరో నెల, రెండు నెలల్లో ఐరన్ రేట్లు పెరిగే అవకాశం ఉందని అమ్మకందారులు చెబుతున్నారు. నిర్మాణ వ్యయం రెండింతలు పెరగడంతో సామాన్యులు, పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్ల వెంచర్లను చేపట్టిన బిల్డర్లు తలలు పట్టుకుంటున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో నిర్మాణ పనులను నిలిపి వేసిన కారణంగా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువవుతోంది. నిర్మాణ రంగంపైనే ఆధార పడిన 42 రకాల కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయి. కుటుంబ పోషణ కోసం వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులో లేని ఇసుక



ఇసుక ఫ్రీ అని చెప్పినా ధర అందుబాటులో లేదు. పునాదుల్లో వేసే మట్టికి ఆంక్షలు విధించడం వల్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. సిమెంట్, ఐరన్ ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వల్ల ఇష్టానుసారంగా ధరలు పెరగడం వల్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని పెంచాలి. సిమెంట్, ఐరన్ సబ్సిడీ ధరలకు ఇప్పించాలి.

- రొంగలి ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మికుల సంఘం.

ఇళ్ల నిర్మాణాలకు రుణాలు అందించాలి



ప్రభుత్వం ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు లోన్లు అందించడం ద్వారా మాకు చేతినిండా పని ఉంటుంది. యజమానులకు ఇసుక అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మాకు నిత్యం పని ఉంటుంది. నూతన ఇసుక పాలసీ తీసుకుని వచ్చినా సరిగ్గా ఇసుక అందడం లేదు. అధిక ధరలకు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. దీని వల్ల సామాన్యులకు ఇసుక రాకపోవడం వల్ల మాకు ఉపాధి ఉండడం లేదు.

పి.దుర్గా ప్రసాద్, తాపీ మేస్త్రి, జగ్గంపేట.

కేరళ బాధితుల సహాయార్థం నిధి సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కేరళలో వరద బీభత్సంతో భారీగా నష్టపోయిన బాధితులను ఆదుకునే నిమిత్తం సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం సహాయ నిధి సేకరించారు. సర్పవరం జంక్షన్, ఇంద్రపాలెం భగత్ సింగ్ విగ్రహం సెంటర్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మెర్ల రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వ శేషుబాబ్జీ, కాకినాడ రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేరళలో ముఖ్యంగా వయనాడ్‌లో కురిసిన అతి వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. దాదాపుగా 300 మంది పైగా మరణించారన్నారు. కేరళలో వరద బీభత్సం వల్ల గ్రామాల మొత్తం వరద నీటితో మునిగిపోయి అనేక ఇల్లు కట్టుకుపోయి సర్వం కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించి కేరళ ప్రజానీకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేరళలో సిపిఎం ఇతర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల కార్యకర్తలు ప్రాణాలకు తెగించి అనేక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారని తెలిపారు. అదే స్ఫూర్తితో ఆంధ్ర రాష్ట్రంలో పార్టీ చురుకైన పాత్ర పోషిస్తూ ఆర్థిక సహాయం అందివ్వడానికి నిర్ణయించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు మానవతా దృక్పథంతో సహాయ కార్యక్రమాలు చేసి సర్వం కోల్పోయిన వాళ్లకి చేయూతనివ్వాలన్నారు. కాకినాడ రూరల్‌లో రూ.18,456 విరాళాలు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్టూరి విజయ్ కుమార్, చెక్కా రమణి, పెద్దింశెట్టి రామకృష్ణ, తోట్టపూడి రాజా, మేడిశెట్టి వెంకటరమణ, వానంశెట్టి చంద్రరావు, అంకం సుబ్రహ్మణ్యం, యు.సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, శ్రీను, రాజేష్, విపిన్ కుమార్ పాల్గొన్నారు.

ఎపికి రిలయన్స్ రూ.25 లక్షల కోట్లు చెల్లించాలి



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కుడిపూడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కెజి.బేసిన్‌లో అపార ఆయిల్ నిక్షేపాలను తరలించుకుపోతూ ఇప్పటికే రూ.50 లక్షల కోట్ల లాభాలు ఆర్జించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ మన రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్లు ఇవ్వాలని ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన చమురు సంస్థల సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ఆయిల్ కంపెనీలు 12వ ఆర్థిక సంఘం చెప్పిన మేరకు స్థానిక ప్రజల అవసరాల కోసం 50 శాతం నిధులు ఖర్చు చేయాలన్నారు. కెజి.బేసిన్‌లో ఉన్న రిలయన్స్ ఆయిల్ కంపెనీ ఈ ప్రాంత ఖనిజ నిక్షేపాలను తరలించకుపోతూ స్థానిక ప్రజల కనీస అవసరాలు తీర్చడం లేదన్నారు. ఎక్కడినుంచి అయితే ఆయిల్ కంపెనీలు నిక్షేపాలు తరలిస్తున్నాయో ఆ ప్రాంతానికి ఎక్కువ నిధులు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. అస్సాం, నాగాలాండ్, ఝార్ఖండ్ వంటి ప్రాంతాల్లో ఉద్యమాల వల్ల చమురు సంస్థలు వచ్చిన లాభాల్లో 50 శాతం నిధులు ఆ ప్రాంతాలకు ఖర్చు చేస్తున్నారన్నారు. మన ప్రాంతంలో రిలయన్స్ వంటి ఆయిల్ కంపెనీలు ఆ మేరకు ఖర్చు చేయకపోవడం లేదన్నారు. మనకున్న 42 మంది ఎంపీలు మన రాష్ట్రానికి రావాల్సిన యాభై శాతం నిధుల కోసం పోరాటం చేయాలన్నారు. ఆయన వెంట పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాడి సత్తిబాబు, నాయకులు కడలి రాంపండు, పాల్గొన్నారు.

రహదారుల పనుల కారణంగా ప్రమాదాలు

ప్రజాశక్తి-గండేపల్లి

జాతీయ రహదారిపై హైవే సిబ్బంది చేసే పనులు ప్రమాదాలకు కారణంగా మారుతున్నాని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండేపల్లి మండలం సుమారు 18 కిలోమీటర్ల విస్తీర్ణం జాతీయ రహదారి ఉండగా నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటోందని జాతీయ రహదారి అనుకున్న గ్రామస్తులు తెలిపారు. దీనిన అరికట్టేందుకు పోలీసులు అనేక నిబంధనలు పెట్టి కూడలి వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టి ప్రమాదాలు అరికట్టే ప్రయత్నం చేస్తుంటే మరొక పక్క జాతీయ రహదారి హైవే సిబ్బంది ప్రమాదాలు జరిగే విధంగా పనులు ఒకచోట హెచ్చరిక ప్లాస్టిక్ స్తంభాలు కిలోమీటర్ల మేరకు పెట్టడం వల్ల వాహనాలు వెళ్లే సమయంలో ఒక పక్కే వెళ్లడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పని ఒకచోటైతే కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం తగదని అంటున్నారు. ప్రమాదాలు జరగకుండా చూడవలసిన హైవే సిబ్బంది ప్రమాదాలకు కారణం అవుతున్నారని వాపోతున్నారు.



అజయ్ కుమార్‌ను పరామర్శిస్తున్న నాయకులు

నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

సామర్లకోటలో దళిత బాలునిపై దాడి చేసిన నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుని ఆదివారం వారు పరామర్శించారు. ప్రేమించినందుకు విద్యుత్ స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టి చిత్ర హింసలకు గురి చేయడం దారుణమన్నారు. బాధితునికి మెరుగైన వైద్యం అందించాలని బాధిత కుటుంబాలకు తక్షణం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.సురేష్ కుమార్, కె.సింహాచలం, సభ్యులు పద్మనాభం, సత్యానందం పాల్గొన్నారు. దాడి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ పవన్ కుమార్ డాక్టర్ భానుమతి, టి.నూకరాజు, న్యాయవాది సుధీర్ డిమాండ్ చేశారు. చికిత్స పొందుతున్న బాలుని వారు పరామర్శించారు.

యుటిఎఫ్ ఉత్సవాల్లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కాకినాడ

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక కచేరిపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ షాన్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యుటిఎఫ్ నాయకులను అభినందించారు. ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐవి), కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యుటిఎఫ్ ఆశయాలైన అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అమలులో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్త దాతలను అభినందించారు. యుటిఎఫ్ ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతం అవుతుందన్నారు. సమస్యల సాధనలో ముందుండే యుటిఎఫ్ కార్యకర్తలు సేవల్లో కూడా ముందుండడం చాలా సంతోషమన్నారు. కూటమి ప్రభుత్వం తరపున ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూనుకుంటామన్నారు. డిఇఒ రమేష్ మాట్లాడుతూ విద్యా సంబంధిత విషయాలల్లోనే కాక సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ యుటిఎఫ్ ఉపాధ్యాయులు పాత్ర పోషించడం చాలా అభినందనీయం అన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి శివప్రసాద్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలు నిలబెడుతుందన్నారు. ఉపాధ్యాయులు ఇటువంటి సేవలు చేయడం వల్ల రాబోయే తరం కూడా సేవాభావంతో నడిచే అవకాశం ఉందన్నారు. ఈ శిబిరంలో 62 మంది రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెవివి నగేష్, టి.రవిచక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.సాయిరాం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వివి.రమణ, కె. నాగమణి, కె.సత్తిరాజు, పివి.సత్యనారాయణ, ఎస్.వీరబాబు, సిహెచ్.సూరిబాబు, కె.దుర్గా దేవి, బి.నూకరాజు, కె.పెద్దిరాజు, టి.సత్తిబాబు, గోవిందరాజులు, గిరిధర్ గోపాల్, వి.సోనీ, ఐ.ప్రసాదరావు పాల్గొన్నారు.



రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న శేష బాబ్జి

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు ముఖ్య అతిథిగా సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బాబ్జి మాట్లాడారు. ఉద్యోగులందరికి పిఆర్‌సి ప్రకారం వేతనాలు చెల్లించాని డిమాండ్ చేశారు. చేట్ల రాంబాబు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 104 సర్వీస్‌లు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరావు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పసుపులేటి శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు ఇందుమతి, డివిజనల్ లీడర్లు తేజ, హరి ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సస్పెన్షన్ తగదు

సచివాలయ ఉద్యోగుల సస్పెన్షన్ తగదు

ప్రజాశక్తి-కాకినాడ

పింఛన్ల పంపిణీని విజయవంతంగా పూర్తి చేసిన సచివాలయ ఉద్యోగల సస్పెన్షన్ తగదని ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ కో ఆర్డినేటర్ దారపురెడ్డి తాతాజీరావు, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ బాషా, కార్యదర్శి జాన్ క్రిస్టోఫర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సుబ్బిరామిరెడ్డి ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతకు ముందు ప్రభుత్వ వ్యవస్థలో మూడు నుంచి ఐదు రోజుల్లో ఇచ్చే పెన్షన్‌లను ఒక్కరోజులోనే పూర్తి చేస్తున్నందుకు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ అభినందించారన్నారు. ఈ విషయాన్ని గమనించకుండా కొన్ని జిల్లాల్లో పెన్షన్ పంపిణీ ఆలస్యంగా మొదలు పెట్టారని షోకాజ్‌లు, సస్పెన్షన్‌ల పేరుతో వేధించడం సరైన పద్ధతి కాదన్నారు. సాంకేతిక కారణాల వల్ల, అనారోగ్య కారణాల వల్ల ఆలస్యంగా మొదలు పెట్టే అవకాశం ఉండవచ్చని, అదే సమయంలో వారు వారికి కేటాయించిన పంపిణీని మొదటి రోజులోనే పూర్తి చేసారా లేదా అనేది కూడా పరిగణనలోకి తీసుకొనాలని కోరుతున్నామన్నారు. ఇలాంటి నిర్ణయాల వల్ల ఉద్యోగుల ఆత్మస్థైర్య దెబ్బ తింటుందన్నారు. ఉద్యోగులపై సస్పెన్షన్‌లు వెంటనే ఎత్తివేయాలని కోరారు.

రసాయన సమీకరణాలపై ప్రయోగాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రియా అసోసియేషన్ తోడ్పాటుతో స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో ఆదివారం 10వ తరగతి విద్యార్థులతో రసాయన శాస్త్రంలో సమీకరణాలు పాఠ్యాంశంపై ప్రయోగాలు నిర్వహించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించి విద్యార్థులతో అనేక ప్రయోగాలు చేయించారు. తాటిపర్తి జెడ్‌పి పాఠశాలకు చెందిన 80 మంది 10వ తరగతి విద్యార్థులు తమ సొంత డబ్బులతో ప్రత్యేక బస్సుపై వచ్చి ఈ ప్రయోగాల్లో పాల్గొన్నందుకు నిర్వాహకులు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. జంతు ప్రేమికులు నవీన్, నాని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, కె.అఖిల తదితరులు పాల్గొన్నారు.

9న వికలాంగుల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

వికలాంగులకు ఉపకరణాలు అందించేందుకు గుర్తింపు శిబిరాన్ని 9వ తేదీ ఉదయం 9 గంటలకు పెద్దాపురం అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ శిబిరంలో ట్రైసైకిల్, వీల్ చైర్స్, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలెటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, ఎంఎస్ఇఇ కిట్లు, ఎడిఎల్ కిట్టులు, సిపి చైర్ బ్యాటరీ ఆపరేటేడ్ మూడు చక్రాల సైకిల్ పొందేందుకు ఎంపిక జరుగుతుందన్నారు. శిబిరంలో పాల్గొనే వారు సదరం ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, యుడిఐడి కార్డులు వెంట తీసుకు రావాలన్నారు.


మరిడమ్మ జాతరలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం



పులిహోర,పాలు పంపిణీ చేస్తున్న దాతలు

స్థానిక మరిడమ్మ జాతరకు 5వ ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో ఆలయ పరిసరాలే కాక సమీప ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. క్యూలైన్లలో వేగవంతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రామమోహనరావు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఆదేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. డిఎస్‌పి లతా కుమారి ఆదేశాల మేరకు సిఐ రవికుమార్, ఎస్ఐ వి.సురేష్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు పులిహార, మంచినీరు, యాత్రికుల పిల్లలకు బిస్కెట్లు, పాలు పంపిణీ చేశారు.



అనధికార పైప్‌లైన్ పనుల అడ్డగింత

ప్రజాశక్తి -సామర్లకోట



బ్రౌన్‌పేటలో పనులపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో భాగ్యనగర్ గ్యాస్‌కు సంబంధించి అనధికారకంగా గ్యాస్ పైప్ లైన్ పనులను నిర్వహిస్తున్నారని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపారు. పట్టణంలో భాగ్యనగర్ గ్యాస్ పనుల పేరుతో రోడ్లు ఛిద్రం చేయడాన్ని హరిబాబు ఆదివారం అడ్డుకున్నారు. గత నెల 31న జరిగిన కౌన్సిల్ సమావేశంలో సైతం భాగ్యనగర్ గ్యాస్ పైప్ లైన్ పనులపై కౌన్సిలర్‌లు అభ్యంతరం వ్యక్తం చేసారు. అంతకు ముందు నుంచే గ్యాస్ పైప్ లైన్ పనులు యథేచ్ఛగా జరుగుతున్నా మున్సిపల్ అధికారులు అవి గ్యాస్ పైప్ లైన్ కాదని చెప్పడం విచిత్రంగా అనిపిస్తోందన్నారు. అది భాగ్యనగర్ గ్యాస్ పైప్ లైనుగా పనిచేసే సిబ్బందే అంగీకరించారని కౌన్సిలర్ జరిబాబు చెప్పారు. దీనిపై మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదన్నారు. మున్సిపాలిటీ నుంచి ఏ విధమైన అనుమతులూ లేకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలిపారు. ఈ పైప్ లైన్ పనుల వల్ల ట్రాపిక్‌కు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, రోడ్డు మార్జిన్‌లు పాడవుతున్నాయని హరిబాబు పేర్కొన్నారు. ఈ పనులపై అధికారులు స్పందించి పైప్ లైన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ హరిబాబు డిమాండ్ చేశారు.

వికలాంగుల శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఈ నెల 7న ప్రత్తిపాడులో వికలాంగుల శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం 9 గంటల నుంచి 3 గంటల వరకు జరిగే శిబిరంలో వికలాంగులకు అవసరమైన కత్రిమ అవయవాలు, వాహనాలు, ఇతర ఉపకరణాలు అందజేసే నిమిత్తం లబ్ధిదారులను గుర్తిస్తామన్నారు. వికలాంగులకు అవసరమైన మూడు చక్రాల వాహనాలు, సంక కర్రలు, వీల్ చైర్లు, కత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలెటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ కిట్ల పంపిణీకి లబ్ధిదారులను గుర్తిస్తారని తెలిపారు.

పిఆర్ పాఠశాల పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



పదో తరగతి పూర్వ విద్యార్థుల సమావేశం

కాకినాడ పిఆర్ ప్రభుత్వ పాఠశాలలో 1983-84 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట ఎస్ఆర్ఎంటి చౌదరి గెస్ట్ హౌస్ వద్ద శ్రీ కన్వెన్షన్ హాల్లో స్నేహితులందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 40 ఏళ్ల తరువాత కలిసిన మిత్రులందరూ తమ అనుభూతులను పంచుకున్నారు.

గుంతలో దిగబడిన బస్సు

ప్రజాశక్తి-ఏలేశ్వరం



గుంతలో దిగబడిపోయిన బస్సు

మండలంలోని రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వెళ్లే ప్రధాన రహదారి గుంతలుగా మారడంతో నిత్యం ఏదో వాహనం దిగబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతూనే ఉంది. ఈ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏలేశ్వరం నుంచి ఏజెన్సీ ఏడు మండలాలకు ఇదే రహదారి. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఉద్యోగులు, ఉన్నత విద్య కోసం విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు నిమిత్తం ప్రజలు ఏలేశ్వరం రావలసిన తరుణంలో పలు ఇబ్బందులకు గురవుతున్నారు.

నేరాలు ఘోరాలు



బాలికను బంధువులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

దారి తప్పిన బాలిక బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

విశాఖపట్నంలోని కంచరపాలెం మురళీనగర్‌కు చెందిన ఒక బాలిక దారితప్పి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకోగా ఆదివారం తెల్లవారుజామున రైల్వే పోలీసులు బంధువులకు అప్పగించారు. సామర్లకోట జిఆర్‌పి పోలీసుల సమాచారం శనివారం అర్ధరాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై ఒక బాలిక కనిపించింది. రైల్వే పోలీసులు ఆమెను విచారించి స్కూల్ ఐడీ కార్డులో ఉన్న సెల్ నంబర్‌కు ఫోన్ చేయడంతో వివరాలు తెలిశాయి. బాలికకు తండ్రి, తల్లి లేరని, అమ్మమ్మ వద్ద పెరిగిందని తెలిసింది. బాలిక కనిపించడం లేదని అమ్మమ్మ కంచరపాలెంలో ఫిర్యాదు చేసింది. సామర్లకోట రైల్వే పోలీసులు కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సామర్లకోట చేరుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున బాలికను వారికి అప్పగించినట్లు రైల్వే పోలీసులు చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో ఒక కోళ్ల ఫారంలో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. పెదకొండేపూడి గ్రామానికి చెందిన కారింగుల కొండయ్య(38) కోళ్ల ఫామ్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కోళ్లను ఎగుమతి చేసేందుకు కోళ్లను తీసుకొస్తుండగా విద్యుత్తు వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-నల్లజర్ల

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో పంచదార రాజేష్ కుటుంబ సభ్యులతో ద్వారక తిరుమల మండలం ఈస్ట్ ఎడవల్లి గ్రామంలో ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో నాలుగు కాసుల బంగారం, కేజీ వెండి సామగ్రిని చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులను ఆశ్రయించారు.



పులిహోర పంపిణీ చేస్తున్న దాతలు

యాత్రికులకు ఫలహారాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ జాతర సందర్భంగా 5వ ఆదివారం అత్యధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో పలు సంఘాల వారు, స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు వివిధ రకాల ఫలహారాలు, మంచినీరు, పిల్లలకు బిస్కెట్లు,, పాలు పంపిణీ చేశారు. మరిడమ్మ ఆలయ పరిసరాలలో ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారా వీటిని అందజేశారు. స్థానిక తాళ్లూరి వారి సత్రం, శ్రీవిజయ దుర్గ గూడ్స్ ఆటో ఓనర్స్ వర్కర్స్ యూనియన్, బంగారమ్మ గుడి వీధి యూత్ ఆధ్వర్యంలో యాత్రికులకు పులిహోర, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మమ్మున నాగరాజు, గణేష్, సత్తిబాబు, శ్రీను, చౌదరి, రమేష్, నూకరాజు, గోపి, వెంకన్న, దేవుడు, గోకేడ అప్పారావు, గడ్డం లక్ష్మణరావు పాల్గొన్నారు.



రాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తూర్పుపాకలులో తల్లిపాల వారోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

తూర్పుపాకలులో సర్పంచ్ పడాల అన్నపూర్ణ అధ్యక్షతన ఆదివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కాండ్రకోట సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.చంద్ర కిరణ్ బాబు, డాక్టర్ ఉషా ప్రియదర్శిని మాట్లాడారు. బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా వారు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచ్ అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్వైజర్ ఉమాదేవి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఒ శాంతకుమారి, ఎంపిపి టిఎం.నాగమణి పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి -కరప

మండలంలోని ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. 23 గ్రామ పంచాయతీల్లో 2023 నుండి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి పనులు, సామాజిక భద్రత పింఛను, సామాజిక తనిఖీ బృందం వారిచే తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



నిండుకుండలా దర్శనమిస్తున్న ఏలేరు రిజర్వాయర్

ఏలేరు రిజర్వాయర్‌కు జలకళ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీరు వచ్చి చేరడంతో ఏలేరు రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. రిజర్వాయర్ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు రైతుల పరిస్థితి ఏంటి అనుకున్న తరుణంలో వర్షాలు ఆశాజనకంగా మారాయి. రిజర్వాయర్ సామర్థ్యం 86. 56 మీటర్ల కాగా ఆదివారానికి రిజర్వాయర్ నీటిమట్టం 80. 55 మీటర్లకు చేరుతుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి 5021 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ అవసరాల నిమిత్తం ఎడమ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆయకట్టుకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌సి నాయకులు

ఎస్‌సి వర్గీకరణ తీర్పుపై నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఆదివారం దివిలి గ్రామంలో నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కండెల్లి వీరబాబు, గుబ్బల రాజు, బండి రాజు, పిల్లి అప్పారావు, ఎన్.శ్రీను, ఎం.ప్రసాద్, జుత్తుగ సత్యనారాయణ, కాటూరి సత్తిబాబు, మడికి శ్రీను, ఎం.వెంకటకృష్ణ, కుంచే నూకరాజు, నిమ్మగంటి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - సామర్లకోట

పలు పోటీల్లో బాలమందిరం విజేతలకు ఆదివారం సాయంత్రం బాలమందిరు నిర్వాహకులు అంగర గోపాలకష్ణ బహుమతుల అందజేసి సత్కరించారు. మాధవపట్నం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ బాల మందిరంలో ఆదివారం జరిగిన బాలల సభలో విద్యార్థులు పుస్తక పఠనం, కథాకథనం, కథలకు బొమ్మలు వేసే పోటీలు, తొలుత ఇన్ డోర్ గేమ్స్ పోటీలు, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు కృష్ణశ్రీ బహుమతులు అందజేశారు.

పారిశుధ్య సిబ్బందిని పెంచాలి

ప్రజాశక్తి -కాకినాడ

కాకినాడలో 400 మందికి ఒక్కరు వంతున 1,272 మంది పారిశుధ్య సిబ్బందితో వెట్టి చాకిరీ చందంగా ఉందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు పేర్కొన్నారు. వీరిలో 402 మంది రెగ్యులర్ కాగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో 690, ప్రత్యేక కార్మికులుగా 180 మంది ఉన్నారన్నారు.కనీసంగా ప్రతి100 మందికి ఒక పారిశుధ్య వర్కర్ నియామకం జరగాలన్నారు. స్మార్ట్ సిటీలో పారిశుధ్య కార్మికుల వెట్టి చాకిరీ విముక్తి పొందాలంటే కనీసంగా 4 వేల మంది ఉండాలన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

జాతర ఉత్సవాల ప్రారంభం

ప్రజాశక్తి- సామర్లకోట

పట్టణంలో భీమేశ్వరాలయం వద్ద మదుగులమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలను పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ, రైతు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మదుగులమ్మ అమ్మవారి జాతర ఊరేగింపును కొబ్బరికాయ కొట్టి ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జాతర ఉత్సవం పురవీదుల్లో రాత్రి వరకూ కొనసాగించారు. ఉత్సవాల్లో పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రసాద్, రైతు సంఘం నాయకులు కంటే జగదీశ్ మోహన్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పైన్ని శ్రీనివాస్‌రావు వల్లూరి దొర, చంద్రు బలరామ్, బలుసు వాసు, ఆలయ కమిటీ నాయకులు, అర్చకులు, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఉద్యాన పంటలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో లంక గ్రామాల్లో వరద తగ్గింది. వరద నీరు లంక గ్రామాలను ముంచెత్తడంతో ఆయా గ్రామాల్లోని ఉద్యానవన పంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మండల పరిధిలో పిళ్ళంక పంచాయతీ కొత్తలంక, ఇంజరం పంచాయతీ అరటికాయలంక గ్రామాల్లో సాగుచేసిన ఉద్యానవన పంటలు మాత్రం కుళ్ళిపోయాయి. ఉద్యానవన శాఖ అధికారుల నివేదిక ప్రకారం ఒక కొత్తలంక గ్రామంలో సుమారు 12 ఎకరాల్లో కాయగూరలు, 4 ఎకరాల్లో అరటి, బొప్పాయి, సుమారు 5 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం సంభవించినట్లు తెలియజేస్తున్నారు. వరదల వల్ల కలిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు.

యానాం వార్తలు



యానాంలో సిఎం రంగసామి పుట్టినరోజు వేడుకలు

ఘనంగా సిఎం రంగసామి పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి పుట్టినరోజు వేడుకలు యానాంలో మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మల్లాడి కృష్ణారావు స్వగహం వద్ద మల్లాడి అభిమానులు కార్యకర్తలు, నాయకులు, ఆశా వర్కర్లు సిఎం రంగసామి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, స్వీట్స్ పంచారు. అనంతరం యానాం ఓల్డేజ్ హోమ్ వృద్ధులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు ఫ్రూట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యానాం మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, యానాం రిటైర్డ్ సిఐ గూటం శివ గణేష్, మట్టపర్తి గణేష్, వెంకటేశ్వరరావు, మల్లాడి శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికైన ఆర్‌టిసి ఇయు రాష్ట్ర కార్యవర్గం

ఆర్‌టిసి ఇయు రాష్ట్ర కార్యదర్శిగా భీమన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా ఏలేశ్వరం డిపో కండక్టర్ భీమన సూరిబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన యూనియన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆఫీస్ బ్యానర్ల ఎంపిక చేపట్టారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఆర్‌టిసి విలీన ప్రక్రియలో సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా అనాగరిక క్రమశిక్షణ చర్యలు అమలు పరుస్తున్నారని వీటిని ప్రభుత్వం సవరించాల్సిన అవసరం ఉందన్నారు. సూరిబాబు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నిక కావడం పట్ల ఏలేశ్వరం డిపోలోని పలువురు సహచర కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

తాళ్లరేవు: పూర్వ విద్యార్థులంతా స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందరూ కలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. తాళ్లరేవు నామన వెంకాయమ్మ జెడ్‌పి హైస్కూల్లో 1985 - 86 సంవత్సరంలో చదివిన విద్యార్థులు కొన్నేళ్ల క్రితం గోల్డెన్ గ్రూపుగా ఏర్పడి కష్టంలో ఉన్న స్నేహితులను ఆదుకుంటున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం తాళ్లరేవు లోని తోటి స్నేహితురాలు సామా సుజాత స్వగహంలో అందరూ కలిసి స్నేహితుల దినోత్సవ వేడుక చేసుకున్నారు. ఒకరికొకరు ఫ్రెండ్ షిప్ బ్యాండ్ లు కట్టుకుని ఆనందంగా గడిపారు.

కాకినాడరూరల్: స్నేహం అనేది షరతులు లేని ఆప్యాయతలతో గుర్తించబడిన చాలా స్వచ్ఛమైన సంబంధమని దీనికి ప్రపంచంలో ఎంతో విలువ అని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్నేహితుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న ఆధునిక కాలంలో కష్ట సుఖాలలో పాలుపంచుకునేది స్నేహితులని అన్నారు. అనంతరం డాక్టర్ అడ్డాల స్నేహితులకు పూల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు , విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలపై సిఎంకు వినతి

కాకినాడరూరల్ :ఆరు గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని సిఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని అందజేసినట్లు మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక వలస పాకల లో రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ తదితరులు అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను సత్కరించి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించను న్నందున విలీన ప్రక్రియ సాధ్యాసాధ్యాలపై పరిశీలిస్తామని అన్నారు. దీనిపై హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన ప్రజాప్రతినిధుల తీర్మానం ప్రకారం విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాల్సి ఉందని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై పార్టీ అధ్యక్షులైన పల్లా శ్రీనివాస్ ను కలవాలని చంద్రబాబు సూచించగా తాము ఆయనను కూడా కలిసి చర్చించామని సత్యనారాయణ మూర్తి తెలిపారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ రమణయ్యపేట తదితర గ్రామాలకు గత 13 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించనున్నందున అభివృద్ధి కుంటుపడిందని ఈ విషయమై స్పందించిన మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

ఘనంగా సోదరీమణుల దినోత్సవం

కాకినాడరూరల్ : రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోదరీమణుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు మొదటి ఆదివారం జాతీయ సోదరీమణుల దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. జీవితాంతం అత్యంత సన్నిహిత స్నేహితులుగా సోదరీమణులు మసులుకుంటారని అన్నారు. అక్క చెల్లెల అనుబంధం లో ఒకరికొకరు ఎప్పుడు సంతోషంగా ఉండాలని కోరుకుంటారని అన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో సోదరీమణులకు నూతన వస్త్రాలను బహుకరించారు.కార్యక్రమంలో డాక్టర్ కె.వెంకటరమణ, న్యాయవాది యనమల రామం, రేలంగి బాపిరాజు, రాజా, ప్రసాద్‌నాయుడు, రామారావు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

అనారోగ్యంగా బాధపడుతున్న చిన్నారులకు ఆదివారం పలువురు సాయం అందజేశారు.



ద్రాక్షారామలో చిన్నారి కుటుంబానికిసాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి రాష్ట్ర కార్మిక శాఖమంత్రి సుభాష్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ద్రాక్షారామ లో చిన్నారి వాసంశెట్టి జోష్ణ అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మంత్రి వారి ఇంటికి వెళ్లి ఆమె తల్లి తో మాట్లాడారు. చిన్నారి అనారోగ్యంపై ఆమె మంత్రికి వివరించారు. దీనికి స్పందించిన మంత్రి వెంటనే రూ.10 వేలు సాయంగా అందజేశారు. వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించిన మంత్రికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మామిడికుదురు: అప్పనపల్లి అరుంధతి పేటకు చెందిన 13 ఏళ్ల బాలిక ఆకుమర్తి జ్యోతి అరుదైన వ్యాధితో ఇబ్బందులు పడుంఎంది బాలిక వైద్యానికి ఆరోగ్యశ్రీ లో అవకాశం లేదని డాక్టర్ల చెప్పడంతో బాలిక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధి నివారణకు పది ఇంజక్షన్ చేయాలని ఒక్కొక్కటి రూ.85వేలు అవుతుందని తండ్రి వాపోయారు ఇంతవరకు మూడు ఇంజక్షన్లు చేయించామన్నారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. సానికులు రూ.10 వేలు వసూలు చేసి ఆ సహాయాన్ని ఆదివారం బాలిక తల్లిదండ్రులు రమేష్ శాంత కుమారికి అందజేశారు దాతలు స్వచ్ఛందంగా బాలికకు ఆర్థిక సహాయం అందించాలని ఆర్‌ఎంపి వైద్యులు కంకిపాటి వెంకటేశ్వరరావు కోరారు కార్యక్రమంలో తులాగోపాలకష్ణ, తుల నాగరాజు,చిన్న,వినయ్, కంకిపాటి నాగేశ్వరరావు, తులా బ్రహ్మాజీ, అల్లూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



అప్పనపల్లిలో బాలిక వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తున్న స్థానికులు

11న వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

మాల మహానాడు జెఎసి నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టాలని జెఎసి తీర్మానించింది. ఆదివారం అమలాపురం సావరంలో జెఎసి ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా మాల మహానాడు కమిటీలు అన్నీ కలిసి మాల మహానాడు జాయింట్ యాక్షన్‌గా ఆగస్టు 11న మాల మత వీరుల సంస్మరణ దినం సందర్భంగా మత వీరులకు ఘన నివాళి అర్పిస్తారు. అనంతరం ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక నిరసన కార్యక్రమం చేపట్టాలని మాలమహానాడు జెఎసి నిర్ణయించింది. అలాగే మాల మహానాడు అనే బ్రాండ్‌ని పివి.రావు త్యాగాన్ని నిర్వీర్యం చేసే అధికారం ఎవరికీ లేదని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాటం ఎప్పటికీ మాలమహానాడు జెఎసి ద్వారానే జరుగుతుందని మాలమహానాడు తీర్మానించింది. కార్యక్రమం లో పండు అశోక్ కుమార్, ఎంఎకె.భీమారావు, జగడం సత్యనారాయణ, చీకురుమెల్లి కిరణ్ కుమార్, ఉండ్రు బాబ్జి, పోతుల నాగరాజు, పెనుమాల చిట్టిబాబు, కాశి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేకును మంత్రి విలేకరుల సమక్షంలో కట్ చేశారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం శుభాకాంక్షలు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రపురం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంఘాల సమస్యల ను పరిష్కరిస్తానని, ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు కషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా విలేకరులు సంఘాలు, విభేదాలు లేకుండా ఐక్యంగా కొనసాగాలనికోరారు. కార్యక్రమంలో మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, మీడియా సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు ప్రసంగించారు. రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల సభ్యులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న మంత్రి సుభాష్

ధనమ్మ మర్రికి పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని లంక గ్రామమైన కేదార్లంక శివారు వీధి వారి లంకలో ధనమ్మ మర్రికి ఆదివారం యాత్రికులు, పర్యాటకులు తరలివచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన యాత్రికులు ధనమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. గోదావరి నది తీరం వెంబడి ఆహ్లాదకరమైన అందాలను ఆస్వాదిస్తూ సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంగర ఎస్ ఐ ఎ.పరదేశి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ధనమ్మ మర్రి వద్ద సందడి చేస్తున్న యాత్రికులు



ఎస్ఐ శ్రీనునాయక్‌కు చిత్రపటాన్నిబహూకరిస్తున్న ఉపాధ్యాయుడు

ఎస్ఐకు చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి-ఆలమూరు

స్థానిక పిఎస్‌లో ఆదివారం ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్‌కు స్వీయ చిత్రపటాన్ని డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బహూకరించారు. రాయవరం మండలంలోని వెదురుపాక జెడ్‌పి హైస్కూల్లో డ్రాయింగ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వాసంశెట్టి రాధాకృష్ణ ఎస్ఐ శ్రీను నాయక్ ఫొటోను కాన్వాయస్ పద్ధతిలో రంగులతో అద్ది చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. ఆ చిత్రపటాన్ని ఆదివారం ఎస్ఐకు అందజేశారు. ఉపాధ్యాయుడు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం రాయవరం ఎస్ఐగా పనిచేసి కోవిడ్ సమయంలో అనేక సేవలు అందించారన్నారు. ఆ సేవలకు మెచ్చి ఈ చిత్ర పటాన్ని బహూకరించానని గోపికృష్ణ తెలిపారు. ఎఎస్ ఐలు ఎం.సూర్యచంద్రరావు, కెవి.రమణారెడ్డి పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్‌పి నరసింహకిషోర్ తెలిపారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు వద్ద 443 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను డిఎస్‌పి అంబికాప్రసాద్ వివరించారు. ఒక వ్యాన్‌లో తెల్లని ప్లాస్టిక్ సంచుల్లో గంజాయిని తరలిస్తున్నారన్నారు. పోలీసులు తనిఖీలు చేసి దీన్ని పట్టుకునాని తెలిపారు. తమిళనాడుకు చెందిన వ్యాన్ డ్రైవర్ దివాకర్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. నగరంలో ఇప్పటికే గుర్తించిన పలు ప్రాంతాల్లో పోలీసిర్‌ను బలోపేతం చేశామన్నారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.